క్లుప్తంగా

వైఎస్ఆర్‌టీపీ టికెట్ కోసం దరఖాస్తు



బోధన్: వైఎస్ఆర్‌టీపీ నియోజక వర్గ కో – ఆర్డినేటర్, మండలంలోని నాగన్‌పల్లికి చెందిన నింబూరి సత్యవతి అసెంబ్లీ టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో అధికార ప్రతినిధి పిట్ట రాంరెడ్డికి సోమవారం దరఖాస్తు అందజేశారు. ఆమెవెంట పార్టీ జిల్లా అధ్యక్షుడు గౌతంప్రసాద్, రాష్ట్ర నాయకులు ఉన్నారు.

మంత్రి ప్రశాంత్‌రెడ్డికి పరామర్శ



వేల్పూర్: రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తల్లి మంజులమ్మ ఇటీవల మృతి చెందగా, ప్రశాంత్‌రెడ్డిని గనులు, భూగర్భ వనరులు, సమాచారశాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీ శంకర్ సోమవారం వేల్పూర్‌లో పరామర్శించారు. మంజులమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి వెంట మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్, డీసీసీబీ వైస్ చైర్మన్ రమేశ్‌రెడ్డి తదితరులున్నారు.

దర్గాను దర్శించుకున్న మైనంపల్లి



రెంజల్(బోధన్): హైదరాబాద్‌లోని మల్కాజ్‌గిరి కాంగ్రెస్ అభ్యర్థి మైనంపల్లి హన్మంత్‌రావు మండలంలోని నీలా గ్రామశివారులో ఉన్న సైలానీబాబా దర్గాను దర్శించుకున్నారు. ఆదివారం రాత్రి తన ద్వితియ కుమారుడితోపాటు అభిమానులతో కలిసి హన్మంత్‌రావు వచ్చారు. దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేసి చాదర్‌ను అలంకరించారు. ఆయనను దర్గా నిర్వాహకుడు వహీద్‌బాబా శాలువాతో సత్కరించారు.

ప్రచారానికి రావాలని ఆహ్వానం

బోధన్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి రావాలని మహారాష్ట్ర భారీ నీటిపారుదల శాఖమంత్రి గులాబ్‌రావుపాటిల్, నాందేడ్ ఎమ్మెల్యే బాలాజీ కళ్యాణ్‌కర్‌ను బోధన్‌కు చెందిన శివసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పసుపులేటి గోపికిషన్ కోరారు. నాందెడ్‌లో సోమవారం వారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మహారాష్ట్ర మంత్రి, ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రచారానికి వస్తామని హామీ ఇచ్చారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎనుగంటి ప్రీతంగౌడ్, భారతీయ విద్యార్థి సేన జిల్లా కో–కన్వీనర్ లోకేష్‌గౌడ్, నాయకులు శ్రీను, లింగం తదితరులు నాందెడ్ వెళ్లినవారిలో ఉన్నారు.

ఐఎన్‌టీఐ వర్సిటీ కాన్ఫరెన్స్‌కు సుధాకర్

పెర్కిట్(ఆర్మూర్): మలేసియాలోని ఐఎన్‌టీఐ అంతర్జాతీయ విశ్వవిద్యాలయంలో ఈనెల 29 నుంచి నవంబర్ 7వ తేదీ వరకు నిర్వహించనున్న కాన్ఫరెన్స్, వర్క్‌షాప్‌నకు క్షత్రీయ ఇంజినీరింగ్ కళాశాల ఎంబీఏ హెచ్‌వోడీ మాడవేడి సుధాకర్ హాజరుకానున్నారని కళాశాల యాజమాన్యం సోమవారం తెలిపింది. డిజిటల్ లావాదేవీల్లో ప్రపంచ దేశాలకంటే భారత్ ముందున్న తీరు, కరోనా నియంత్రణలో భారత్ అవలంబించిన పద్ధతులతోపాటు ప్రపంచ దేశాలకు వ్యాక్సిన్ అందజేసిన విధానాన్ని, గత రెండు దశాబ్దాల్లో రిటైల్ రంగంలో వస్తున్న మార్పులు, వాటిలో ఇమిడి ఉన్న మేనేజ్‌మెంట్ సబ్జెక్టు అంశాలను అక్కడి పరిశోధన విద్యార్థులకు సుధాకర్ వివరించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సుధాకర్‌ను కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు అభినందించారు.

బీమా పథకంతో పేదలకు ధీమా

భీమ్‌గల్: బీఆర్ఎస్ మేనిఫెస్టోలో సీఎం కేసీఆర్ ప్రకటించిన బీమా పథకంతో పేదలకు ధీమా ఏర్పడుతుందని పార్టీ మండల అధ్యక్షుడు దొన్కంటి నర్సయ్య అన్నారు. సోమవారం నాయకులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజాసంక్షేమమే ప్రధాన లక్ష్యంగా సుపరిపాలన సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమవుతుందన్నారు. గతంలో ఏ ప్రభుత్వమూ రైతులను, దివ్యాంగులను పట్టించుకోలేదని విమర్శించారు. ప్రజలు మళ్లీ బీఆర్ఎస్‌కు మద్దతు తెలుపుతూ మంత్రి వేములను గెలిపిస్తారన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ చౌట్‌పల్లి రవి, ఎంపీపీ ఆర్మూర్ మహేశ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు మల్లెల లక్ష్మణ్, నాయకులు పాల్గొన్నారు.

వైద్యులు లేరు.. ప్రసవాలు ఎలా?

- ఆస్పత్రుల్లో డెలివరీల విషయంలో అధికారుల ఒత్తిడి
- స్త్రీ వైద్య నిపుణులు, మత్తు వైద్యులు లేక నిలిచిన ప్రసవాలు



మోర్తాడ్(బాల్కొండ): ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరిగేలా చూడాలని జిల్లా అధికారులు కింది స్థాయి సిబ్బందిపై ఒత్తిడి తీసుకువస్తున్నారు. ఇదిలా ఉంటే.. స్త్రీ వైద్య నిపుణులు, మత్తు వైద్యులు లేకుండా ఆస్పత్రుల్లో గర్భిణులకు వైద్యం చేసేవారు ఎవరనే ప్రశ్న ఉత్పన్నమవుతున్నది. గతంలో గైనకాలజిస్టులు, మత్తు వైద్యులను ప్రైవేటు ఆస్పత్రుల నుంచి ప్రభుత్వ ఆస్పత్రులకు పిలిపించి ఒక్కో ప్రసవానికి కొంత ఫీజును చెల్లించి సాధారణ, శస్త్ర చికిత్సల ద్వారా కాన్పులు చేయించారు. మత్తు వైద్యులు, స్త్రీ వైద్య నిపుణులకు ఫీజులు చెల్లించడానికి ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతో 'మార్పు' పథకానికి మంగళం పలికారు. ఇప్పుడు మళ్లీ 'మార్పు' పథకానికి కొత్త రూపు తీసుకువస్తూ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్యను పెంచాలని అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఆస్పత్రుల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయకుండా ప్రసవాలు ఎలా చేస్తారో అధికారులు స్పష్టత ఇవ్వడం లేదు. మోర్తాడ్, బాల్కొండ, డిచ్‌పల్లి, ధర్పల్లి, కోటగిరి, వర్ని, నవీపేట్‌లో కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు ఉన్నాయి. ఇందులో ఒక్క బాల్కొండలోనే గర్భిణులకు రెండు రకాల కాన్పులు చేస్తున్నారు. ఆర్మూర్‌లోని వందల పడకల ఆస్పత్రి, బోధన్‌లోని జిల్లా ప్రధాన ఆస్పత్రి, నిజామాబాద్‌లోని మెడికల్ కళాశాల ఆస్పత్రుల్లోనే సాధారణ, శస్త్ర చికిత్సల ద్వారా ప్రసవాలు చేస్తున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కేవలం సాధారణ కాన్పులకు మాత్రమే అవకాశం ఉంది. పీహెచ్‌సీలలోనూ అనుభవం ఉన్న స్టాఫ్ నర్సులే సాధారణ కాన్పులు చేస్తున్నారు. ఒకవేళ శస్త్ర చికిత్స అవసరం ఉంటే ఆర్మూర్ లేదా నిజామాబాద్‌కు తరలించాల్సి వస్తున్నది. కొన్ని రోజుల నుంచి 'మార్పు' కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని అధికారులు వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లతో సమీక్షలు నిర్వహిస్తున్నారు. కమ్యూనిటీ ఆస్పత్రుల్లో ప్రసవాలు ఎప్పటిలాగా కొనసాగాలంటే ఏడుగురు గైనకాలజిస్టులు, మరో ఏడుగురు మత్తు వైద్యుల నియామకం పూర్తి చేయాల్సి ఉంది.

రేడియాలజిస్టులు లేక వృథాగా స్కానింగ్ యంత్రాలు

ఆస్పత్రులకు వచ్చే మహిళ గర్భంలోని శిశువు ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవడానికి ఏర్పాటు చేసిన స్కానింగ్ యంత్రాలు వృథాగా పడి ఉన్నా యి. లక్షల ఖర్చుతో స్కానింగ్ యంత్రాలను గతంలో కొనుగోలు చేశారు. గర్భిణులకు స్కానింగ్ చేయాలంటే రేడియాలజిస్టులు అవసరం. రేడియాలజిస్ట్ లేకపోవడంతో గర్భిణులకు స్కానింగ్ చేసేవారు కరువయ్యారు. గత్యంతరం లేక ఎంతో మంది గర్భిణులు ప్రైవేటు స్కానింగ్ సెంటర్లకు వెళ్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి స్త్రీ వైద్య నిపుణులతోపాటు, మత్తువైద్యులు, రేడియాలజిస్టులను నియమించాలని పలువురు కోరుతున్నారు.



వృథాగా ఉన్న స్కానింగ్ యంత్రం

స్పీకర్‌కు మద్దతుగా ఏకగ్రీవ తీర్మానం



ఏకగ్రీవ తీర్మాన ప్రతిని సురేందర్‌రెడ్డికి అందజేస్తున్న యాదవసంఘం ప్రతినిధులు

రుద్రూర్: బాన్సువాడ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డికి సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు రుద్రూర్ యాదవ సంఘం సభ్యులు ప్రకటించారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలోని యాదవసంఘం కమ్యూనిటీ హాల్‌లో బీఆర్ఎస్ ఇన్‌చార్జి పోచారం సురేందర్ రెడ్డికి ఏకగ్రీవ తీర్మానప్రతిని అందజేశారు. సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ సహకారంతో స్పీకర్ హోదాలో పోచారం శ్రీనివాస్ రెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి చేసిన కృషి గుర్తించి పలు సంఘాలు ఏకగ్రీవంగా మద్దతు ప్రకటిస్తున్నాయని, వారికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. యాదవ సంఘం అధ్యక్షుడు డౌర్ సాయిలు, ఎంపీపీ అక్కపల్లి సుజాతానాగేందర్, జెడ్పీటీసీ నరోజి గంగారాం, వైస్ ఎంపీపీ నట్కరి సాయిలు, విండో చైర్మెన్ సంజీవరెడ్డి, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు పత్తి లక్ష్మణ్, విండో మాజీ చైర్మెన్ పత్తి రాము, కోడె శంకర్, బొట్టె గజేందర్, శివప్రసాద్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

పూజలందుకుంటున్న జగన్మాత

దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి భక్తుల విశేషపూజలందుకుంటున్నారు. నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండోరోజైన సోమవారం గాయత్రిమాతగా అమ్మవారి దర్శనమిచ్చారు. – సాక్షి నెట్‌వర్క్



కోటగిరిలో గాయత్రిదేవి అవతారంలో..



పూజలు చేస్తున్న ఆర్మూర్‌మున్సిపల్ చైర్‌పర్సన్



రుద్రూర్‌లోని మండపంలో భక్తులు

కాంగ్రెస్‌తోనే బలహీనవర్గాల అభివృద్ధి



ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కోటగిరి (రుద్రూర్): కోటగిరి మండలం యాద్‌గార్‌పూర్‌లో మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని అన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. మండల అధ్యక్షుడు షాహిద్, ఎంపీటీసీ కొట్టం మనోహర్, నాయకులు కాసుల రోహిత్, మన్సూర్, గంగాధర్, పీర్యానాయక్, యాదుల్ తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం



సమావేశానికి హాజరైన మండల పరిషత్ సభ్యులు

బాల్కొండ: ముప్కాల్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సామ పద్మ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన సర్వ సభ్య సమావేశం సాదాసీదాగా కొనసాగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. గ్రామాల్లో విష జ్వరాలు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. వైద్యులు అందుబాటులో ఉంటూ ప్రజలకు సేవ లందించాలన్నారు. ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గత సమావేశంలో చేసిన తీర్మానాలపై చర్చించారు. జెడ్పీటీసీ బద్దం నర్సవ్వ, వైస్ ఎంపీపీ ఆకుల చిన్న రాజన్న, కో ఆప్షన్ సభ్యుడు మునీరొద్దీన్, ఎంపీడీవో దామోదర్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, మండలస్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆడబిడ్డల సంబురం

సాక్షి నెట్‌వర్క్ : బోధన్ మండలంతోపాటు సాలూరా, రుద్రూర్, కోటగిరి, పోతంగల్, నవీపేట తదితర మండల కేంద్రాలతోపాటు గ్రామాల్లో సోమవారం బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. మహిళలు తీరొక్కపూలతో బతుకమ్మలను పేర్చి ఆడిపాడారు. కూడళ్లలో బతుకమ్మ పాటలతో సందడి చేశారు. బాల్కొండ మండల కేంద్రంలోని కృష్ణవేణి పాఠశాలలో విద్యార్థినులు బతుకమ్మ ఆడారు.



బాల్కొండలో బతుకమ్మ ఆడుతున్న కృష్ణవేణి స్కూల్ విద్యార్థులు



పెగడపల్లిలో..



వర్ని మండలం జాకోరాలో..



సాలూరా హనుమాన్ మందిరం ఆవరణలో..

భరోసానిచ్చే మేనిఫెస్టో మాది

- కేసీఆర్ మాస్టర్‌స్ట్రోక్‌తో ప్రతిపక్షాలకు మైండ్ బ్లాంక్
- నూత్‌పల్లి ప్రజాఆశీర్వాద యాత్రలో ఎమ్మెల్యే జీవన్ రెడ్డి



డొంకేశ్వర్ మండలం నూత్‌పల్లిలో మాట్లాడుతున్న ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

డొంకేశ్వర్(ఆర్మూర్): బీఆర్ఎస్ మేనిఫెస్టో ప్రజల భవితకు పూర్తి భరోసా ఇవ్వనుందని ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి అన్నారు. కేసీఆర్ ఇచ్చిన మాస్టర్‌స్ట్రోక్‌తో ప్రతిపక్షాలకు మైండ్‌బ్లాకై వారిలో నైరాశ్యం నెలకొందన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం డొంకేశ్వర్ మండలం నూత్‌పల్లిలో 'ప్రజా ఆశీర్వాద యాత్ర'ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు ఘనస్వాగతం పలికారు. జీవన్ రెడ్డి బుల్లెట్ నడుపుతూ గ్రామానికి చేరుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో మళ్లీ బీఆర్ఎస్‌కు ఓటేసి గెలిపిస్తే ఇది వరకే రైతులకు మాత్రమే పరిమితమైన బీమా పథకం, రేషన్ కార్డున్న ప్రతి ఒక్కరికీ వర్తిస్తుందన్నారు. అలాగే ఆరోగ్యశ్రీలో వైద్య ఖర్చుల పెంపు, ప్రతి మహిళకు రూ.3వేల జీవనభృతి, రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీ, రూ.400కే గ్యాస్ సిలిండర్ ఇవ్వడంతోపాటు పింఛన్లు కూడా పెరగనున్నాయని తెలిపారు. అలాగే ప్రభుత్వ నిధులతో ఆర్మూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని, హ్యాట్రిక్ విజయాన్ని అందిస్తే మరింత అభివృద్ధి చేస్తానన్నారు. ఈ సందర్భంగా నూత్‌పల్లి గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులు, ఖర్చు చేసిన నిధులను వివరించారు. కాగా ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటు వేస్తామని రజక సంఘం తీర్మానం చేసిన కాపీని ఎమ్మెల్యేకు అందజేశారు. ఎంపీపీ వాకిడి సంతోష్, సర్పంచ్ కూనింటి రవి, డొంకేశ్వర్ సొసైటీ చైర్మన్ భరత్‌రాజ్‌రెడ్డి, జెడ్పీటీసీ ఎర్రం యమున, ఎంపీటీసీ గంగామణి, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

సుర్బిర్యాల్‌లో..

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ నియోజకవర్గంలో పదేళ్లలో చేసిన అభివృద్ధిని చూసి మూడోసారి ఎమ్మెల్యేగా తనను గెలిపించి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి కోరారు. సుర్బిర్యాల్‌లో నిర్వహించిన ప్రజాఆశీర్వాదయాత్రలో ఆయన పాల్గొన్నారు. గ్రామస్తులు ఆయనకు గజమాలతో స్వాగతం పలికారు. సర్పంచ్ సట్లపల్లి సవిత, నాయకులు సట్లపల్లి గణేశ్, ఇట్టెడి మోహన్‌రెడ్డి, అశ్విన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఆహార దినోత్సవం



కళాశాల ఆవరణలో విద్యార్థులు, సిబ్బంది

రుద్రూర్: రుద్రూర్ ఆహారసాంకేతిక విజ్ఞాన కళాశాల (ఫుడ్ సైన్స్ టెక్నాలజీ)లో సోమవారం ప్రపంచ ఆహారదినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులకు ఉపన్యాస, వ్యాసరచన పోటీలు, ఫుడ్ కాంపిటీషన్ నిర్వహించి ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి రిటైర్డ్ సైంటిస్ట్ హన్మంత్‌రావు హాజరై ఆహారం, నీటి ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఫుడ్ సైన్స్ టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపాల్ కల్పన, వ్యవసాయ పరిశోధన కేంద్రం అధిపతి బాలాజీనాయక్ , కృషి విజ్ఞాన కేంద్రం ఇన్‌చార్జి రాజ్‌కుమార్, ప్రోగ్రాం ఇన్‌చార్జి పద్మావతి, దత్తత గ్రామమైన రాయకూర్ మహిళా రైతులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ



ఆర్మూర్‌టౌన్: హైదరాబాద్‌లోని అబిడ్స్ ట్రాఫిక్ సీఐ నాగమల్లు జన్మదినం సందర్భంగా పట్టణంలోని విద్యా హైస్కూల్ విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, పెన్నులు అందజేసినట్లు లయన్స్ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ గ్రీన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గుజరాతి నివేదన్ తెలిపారు. క్లబ్ మాజీ అధ్యక్షుడు డీజే దయానంద్, ప్రవీణ్‌పవార్, తులసీపట్వార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

సాటాపూర్‌లో బీఆర్ఎస్ సంబురాలు



సాటాపూర్ చౌరస్తాలో పటాకులు కాలుస్తున్న బీఆర్ఎస్ నాయకులు

రెంజల్(బోధన్): బోధన్ బీఆర్ఎస్ అభ్యర్థిగా షకీల్ అహ్మద్‌కు పార్టీ అధినేత కేసీఆర్ బీఫారం అందించడంతోపాటు మేనిఫెస్టోని ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేస్తూ మండలంలోని సాటాపూర్ చౌరస్తాలో సోమవారం సంబురాలు నిర్వహించారు. సర్పంచ్ ఎఖార్‌పాష ఆధ్వర్యంలో మండల నాయకులు, కార్యకర్తలు పటాకులు కాల్చి స్వీట్లు పంచిపెట్టారు. బీఆర్ఎస్‌కు, షకీల్ అహ్మద్‌కు మద్దతుగా నినాదాలు చేశారు. డీజే పాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా ఎఖార్‌పాషతోపాటు రెంజల్ సర్పంచ్ మర్ల రమేశ్‌కుమార్ మాట్లాడుతూ.. మూడోసారి బోధన్‌లో బీఆర్ఎస్ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వీరన్నగుట్ట సర్పంచ్ బైండ్లరాజు, బీఆర్ఎస్ నాయకులు సాయిలు, భూమేశ్, హాజీ తదితరులు పాల్గొన్నారు.

'మూడోసారి అధికారంలోకి వస్తాం'



మాట్లాడుతున్న బద్దం ప్రవీణ్‌రెడ్డి

బాల్కొండ: రాష్ట్రంలో ముచ్చటగా మూడోసారి బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బద్దం ప్రవీణ్‌రెడ్డి ధీమా వ్యక్తంచేశారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అన్ని వర్గాల ప్రజలకు ఆమోదయోగ్యమైన మేనిఫెస్టోను కేసీఆర్ ప్రకటించారన్నారు. బాల్కొండ నియోజకవర్గంలో కేసీఆర్ సహకారంతో మంత్రి ప్రశాంత్‌రెడ్డి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. రాష్ట్రంలో ఎవరూ చేయలేని అభివృద్ధిని చేసి చూపించిననాయకుడు ప్రశాంత్‌రెడ్డి అన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు లింగాగౌడ్, దాసరి వెంకటేశ్, తౌటు గంగాధర్, విద్యాసాగర్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత హోమియో వైద్య శిబిరం


బోధన్: పట్టణంలోని శక్కర్‌నగర్‌లో ఉన్న గంగపుత్ర సంఘం భవనం ఆవరణలో సోమవారం స్థానిక ప్రభుత్వ హోమియో వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. డాక్టర్ హైమావతి, సిబ్బంది పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన

రుద్రూర్: కోటగిరి మండలం ఎత్తొండలో రేణుకా ఎల్లమ్మ విగ్రహప్రతిష్ఠాపనను సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. బాన్సువాడ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి పోచారం సురేందర్‌రెడ్డితోపాటు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నియామకం..

ఐఎన్‌టీయూసీ కార్యదర్శిగా మీసాల సురేశ్



వేల్పూర్: మండలంలోని పడగల్‌కు చెందిన మీసాల సురేశ్ జనరల్ ఐఎన్‌టీయూసీ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల కార్యదర్శిగా నియమితులయ్యారు. ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి తనను నియమించినట్లు సురేశ్ తెలిపారు. అంకితభావంతో తన బాధ్యతను నిర్వర్తిస్తానని అన్నారు.

జాగృతి మండల కన్వీనర్‌గా సంజీవ్



డొంకేశ్వర్(ఆర్మూర్): భారత జాగృతి డొంకేశ్వర్ మండల కన్వీనర్‌గా పొగరి సంజీవ్ నియామకం అయ్యారు. ఈ మేరకు జాగృతి జిల్లా అధ్యక్షులు అవంతి కుమార్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. జాగృతి సంస్థ బలోపేతం కోసం కృషి చేస్తానని, తనను మండల కన్వీనర్‌గా నియమించినందుకు గాను వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు సంజీవ్ కృతజ్ఞతలు తెలిపారు.

దళితమోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా హరీశ్



వర్ని(చందూర్): మండలంలోని ఘనపూర్ గ్రామానికి చెందిన నీలి హరీశ్‌ను బీజేపీ దళిత మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలో దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్ ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు. బీజేపీ కో కన్వీనర్ నూలు శివ, సందీప్‌రెడ్డి పాల్గొన్నారు.

పిరమిడ్ నిర్మాణానికి విరాళం

ఆర్మూర్‌టౌన్: నవనాథ సిద్ధులగుట్టపై పిరమిడ్ నిర్మాణంకోసం పట్టణానికి చెందిన కొండ శ్రీనివాస్ మేఘనా దంపతులు రూ.51,116 విరాళాన్ని పీఎస్ఎస్ఎం జిల్లా అధ్యక్షుడు, అడ్వకేట్ సాయికృష్ణారెడ్డికి సోమవారం అందజేశారు. కార్యక్రమంలో సలహాదారులుగా బొడ్డు దయానంద్, భాషిత స్కూల్ అధినేత సుందర్, పిరమిడ్ మాస్టర్లు చిదుర రాజు, అశోక్ తదితరులు పాల్గొన్నారు

మహిళా సమాఖ్య సమావేశం

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని రెండోవార్డులో సోమవారం మహిళాసమాఖ్య సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి మహిళా సంఘం కోసం రూ.10లక్షలు మంజూరు చేయగా, నిర్మాణం పూర్తి చేశామన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు ఖాందేష్ సత్యం, సాయి, ప్రశాంత్ , ఆర్పీ మమత, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు గోదావరి, సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.